క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ నూతన ఎస్సైగా బి.శంకర్ నాయక్ పదవి బాధ్యతలు సోమవారం స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై మాధవ్‌గౌడ్ ఇటీవల బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పని చేస్తున్న శంకర్ నాయక్‌ను నియమించారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడే విషయంలో పోలీసులకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. మండల పరిధిలో శాంతిభద్రతలకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినట్లయితే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో హోమం



జఫర్‌గఢ్: మండల కేంద్రంలో హనుమాన్ మాలధారులు బైరాగి హనుమాన్ దేవస్థానం వద్ద సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గురుస్వాముల చేతుల మీదుగా ఇరుముడి ధరించారు. 40 రోజుల పాటు ఎంతో నిష్టతో దీక్ష చేపట్టిన మాలధారులు ఊరేగింపుగా కొండగట్టుకు బయలుదేరారు.

అగ్ని ప్రమాదంతో రూ.20 వేల ఆస్తి నష్టం



పాలకుర్తి టౌన్: మండలంలోని ముత్తారంలో అగ్నిప్రమాదంతో రూ. 20 వేల ఆస్తి నష్టం జరిగినట్లు రైతు మంచినీళ్ల ఉపేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం విద్యుత్ స్తంభంపై షాట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో పశుగ్రాసంతో పాటు విద్యుత్ మోటర్ వైరు కాలిపోయిందన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఈ ఘటన జరిగిందని ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



కొడకండ్ల: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలైన ఘటన సోమవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పెరిక ఉపేందర్, అతని కుమారుడు తన్మయ్‌లు బైక్‌పై మండలంలోని నర్సింగాపురం వెళ్లి తిరిగి కొడకండ్లకు వెళ్తున్నారు. ఆ క్రమంలో మండల కేంద్రం సమీపంలోని బయ్యన్న వాగు మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి ఇరువురికి గాయాలయ్యాయి. ఇరువురిని 108లో ఎంజీఎంకు తరలించారు. ఈ ఘటనలో తన్మయ్ పరిస్థితి విషమంగా మారిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడు నర్సింహస్వామి మృతి



నర్సింహస్వామి (ఫైల్)

దేవరుప్పుల: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, జనగామ మార్కెట్ మాజీ చైర్మన్ పరావస్తు నర్సింహస్వామి(68) హైదరాబాద్‌లో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. మండలంలోని చిన్నమడూర్ సర్పంచ్‌గా, దేవరుప్పుల జెడ్పీటీసీగా ప్రాతినిధ్యం వహించిన నర్సింహస్వామి జనగామ, చెన్నూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం వ్యూహాత్మక రాజకీయ చాతుర్యం కలిగిన వ్యక్తిగా చరిత్ర ఉంది. రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండే స్వామి మరణంపట్ల కాంగ్రెస్ శ్రేణులు, ఇతర వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతునికి నలుగురు కూతుళ్లు ఉన్నారు. ముగ్గురు విదేశాల్లో ఉండడంతో బుధవారం హైదరాబాద్ నాగోల్‌లో ఆయన స్వగృహంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు గ్రామస్తుడు పరీదుల భాస్కర్‌గౌడ్ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

● ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య , పక్కన అధికారులు, ప్రజాప్రతినిధులు

స్టేషన్‌ఘన్‌పూర్: క్రీడలతో మానసికోల్లాసంతోపాటు దేహదారుఢ్యం పెరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఘన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం కప్–2023 మండల స్థాయి క్రీడలను సోమవారం ఎమ్మెల్యే రాజయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కందుల రేఖగట్టయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, క్రీడా మంత్రిత్వ శాఖ ద్వారా నిర్వహిస్తున్న తెలంగాణ క్రీడా సంబురాల్లో భాగంగా సీఎం కప్–2023 క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయి క్రీడలు ఈనెల 17వరకు ఉంటాయని, మండలస్థాయిలో ప్రతిభ చూపిన వారు జిల్లాస్థాయిలో ఆడుతారని, అక్కడ నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా సరదాగా వాలీబాల్, ఫుట్‌బాల్, బాక్సింగ్ ఆటలను ఆడి ప్రారంభించారు. ఏసీపీ రఘుచందర్, తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, ఎంపీటీసీలు గన్ను నర్సింహులు, ఎస్.దయాకర్, డీవైఎస్‌ఓ గోపాల్‌రావు, పాఠశాల హెచ్‌ఎం ఎండీ.అజామోహినోద్దీన్, పీఈటీలు పాల్గొన్నారు.

క్రీడలు శరీరదారుఢ్యానికి దోహదం

లింగాలఘణపురం: క్రీడలు మానసికోల్లాసంతోపాటు శరీరదారుఢ్యానికి దోహదపడుతాయని దోహదపడుతాయని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ గ్రౌండ్‌లో సీఎం కప్ క్రీడలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, సీఎం కప్ చైర్మన్ చిట్ల స్వరూపరాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పల్లెలో క్రీడా ప్రాంగణాలు ఉన్నాయని, ఇదంతా సీఎం కేసీఆర్ కృషి ఫలితానికి నిదర్శనమని అన్నారు. తాను యూనివర్సిటీ కబడ్డీ క్రీడాకారునిగా ఉన్నానని, అదే నేడు నా శారీరకధారుఢ్యంతో పాటు రాజకీయంగా ఎదిగేందుకు ఎంతో దోహదపడ్డాయని అన్నారు. సీఐ సంతోష్, తహసీల్దార్ అంజయ్య, ఎంపీడీఓ మల్లికార్జున్, నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, మార్కెట్ డైరెక్టర్ ఆంజనేయులు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గణపతి, నాగేందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపల్లి: పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ



జఫర్‌గఢ్: మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు బేబి

క్రీడలను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం

జఫర్‌గఢ్: రాష్ట్రంలో క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి అన్నారు. మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు జరగనున్న సీఎం కప్ 2023 మండల స్థాయి క్రీడలను బేబి సోమవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, మండల నోడల్ అధికారి ఎండి పర్వేజ్, పీఈటీలు రవి, యాదగిరి, మనోహర్, శ్రీనివాస్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

రఘునాథపల్లి: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ మేకల వరలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడల పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులు రాణించాలని కోరారు. ఎంపీడీఓ హషిం, జనగామ రూరల్ సీఐ సంతోష్, ఎస్సై రఘుపతి, సర్పంచ్ పోకల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

జనగామ రూరల్: పట్టణంలోని మూడో విడత ఇందిరమ్మ ఇళ్లలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ కోరారు. సోమవారం ఇందిరమ్మ లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లలో తాగునీరు, విద్యుత్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎలాంటి వసతులు లేక అవస్తలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం నేడు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లింగం, గౌసియా, శశిరేఖ, భవాని, రజిత, అంజమ్మ, రేణుక, రమ, యాదగిరి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న లబ్ధిదారులు

మార్పు కోరుకుంటున్న ప్రజలు

● టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చేపూరి వినోద్

స్టేషన్‌ఘన్‌పూర్: బీజేపీ, బీఆర్‌ఎస్ నిరంకుశ, నియంతృత్వ పాలనపై ప్రజలంతా విసుగుచెంది ఉన్నారని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చేపూరి వినోద్ అన్నారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు చేస్తున్న అవినీతిపై ప్రజలను చైతన్యం చేసేలా చేపూరి వినోద్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర కొనసాగుతోంది. సోమవారం విశ్వనాథపురం, తానేదార్‌పల్లి గ్రామాల్లో యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతాంగ సమస్యలు ఏమాత్రం పట్టడం లేదని మండిపడ్డారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాల్లో రైతులు గోసపడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల పక్షపాతిగా ప్రభుత్వం పనిచేసిందని, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రైతుల హృదయాల్లో ఇప్పటికీ చిరస్థాయిగా ఉన్నారన్నారు. కర్ణాటక రాష్ట్ర ప్రజలు సరైన తీర్పు ఇచ్చారని, కర్ణాటక ఫలితాలే రానున్న రోజుల్లో తెలంగాణలో వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు అక్కిరెడ్డి, సంపత్‌రెడ్డి, మంతెన హరీష్, లింగయ్య, కుమార్, గాదె ఎల్లయ్య, మోహన్‌రెడ్డి, షబ్బీర్, మైబెల్లి, కిష్టయ్య, భిక్షపతి, ఆదాంతో పాటు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న చేపూరి వినోద్

ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు

స్టేషన్‌ఘన్‌పూర్: ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవమైన పెద్దమ్మతల్లి, రేణుకా ఎల్లమ్మ 11వ వార్షికోత్సవాలు ఘన్‌పూర్ జంటపట్టణమైన శివునిపల్లిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం పెద్దమ్మతల్లి పట్నాలు, పెద్దమ్మతల్లి బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా పెద్దమ్మతల్లి గుడివద్ద ఉత్సవ కమిటీ, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఉదయం అమ్మవార్ల అభిషేకాలు, యాగ మంటప దేవతా హోమాలు, మహా మంగళహారతి పూజలు చేపట్టారు. మధ్యాహ్నం పెద్దమ్మతల్లి పట్నాలు, రాత్రి బోనాలు నిర్వహించారు. సాయంత్రం ముదిరాజ్ మహిళలు, కుల పెద్దలు పెద్ద ఎత్తున సామూహికంగా డప్పు చప్పుళ్లతో బోనాలతో పెద్దమ్మ గుడి వద్దకు వెళ్లి మొక్కులు సమర్పించి పూజలు చేశారు. పెద్దమ్మతల్లి బోనాల పండుగతో శివసత్తుల పూనకాలు, డీజే సౌండ్స్ పాటలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పూజల్లో ఎంపీటీసీ బూర్ల లత, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు బూర్ల శంకర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నీల లింగం, సొసైటీ కార్యదర్శి చెన్నూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు నీల బుచ్చయ్య, ఉత్సవ కమిటీ కార్యదర్శి కొండ వేణు, ఉపాధ్యక్షులు సంకెళ్ల రవి, డైరెక్టర్లు సోమయ్య, రాజయ్య, మల్లయ్య, వేణు, సుమన్, యాదగిరి, చిక్కుడు రమేష్, కుమ్మం సతీష్ పాల్గొన్నారు.



బోనాలతో వెళ్తున్న మహిళలు, భక్తులు

‘స్పోకెన్ ఇంగ్లిష్’ను సద్వినియోగం చేసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా శాఖ, పూలే అధ్యయన వేదిక సంయుక్తంగా నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్ కోరారు. డివిజన్ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్‌ఎస్‌లో ఈనెల 17 నుంచి 23వ తేదీవరకు స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు ఉంటాయని, ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ తరగతులు నిర్వహిస్తారన్నారు. సుశిక్షితులైన ఇంగ్లిష్ ఉపాధ్యాయులు, పూలే అధ్యయన వేదిక బాధ్యులు డాక్టర్ మల్లేశం, గుండె కనకయ్య ఆధ్వర్యంలో ఈ తరగతులు బోధిస్తారని, ఘన్‌పూర్ మండలంతో పాటు సమీప మండలాల గ్రామాలకు చెందిన 6 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు తరగతులకు హాజరయ్యేందుకు అర్హులన్నారు. జిల్లాలో ఇప్పటికే రెండు విడతలుగా బచ్చన్నపేట, పాలకుర్తి మండలాల్లో నిర్వహించారని, మూడవ విడతగా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు టీఎస్ యూటీఎఫ్ అకడమిక్ సెల్ కన్వీనర్ తోట వెంకటేశ్వర్లు–8185827550 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గజ్జల రాజు, తాళ్లపల్లి నీలకంఠం, చిక్కుడు శ్రీనివాస్, గుగులోతు ఫకీర్‌దాస్, యాతం రమేష్, పిట్టల మహేందర్, కృష్ణమోహన్, నాగరాజు, సతీష్, అమర్‌నాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంగు జయప్రకాశ్

హైదరాబాద్‌కు తరలిన విశ్వబ్రాహ్మణులు

జనగామ రూరల్: హైదరాబాద్‌లోని మల్లాపూర్‌లో బీజేపీ విశ్వకర్మ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఎం విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ సభకు సోమవారం జిల్లా విశ్వకర్మ, సెల్ అధ్యక్షుడు దిగోజు సాంబాచారి నేతృత్వంలో సంఘం నాయకులు తరలివెళ్లారు. వాహన ర్యాలీని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. విశ్వకర్మ సంఘం నాయకులు ఉన్నారు.



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న నాయకులు

క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులను సన్మానిస్తున్న అసోసియేషన్ జిల్లా బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: షూటింగ్ బాల్ సీనియర్ విభాగం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మండలంలోని ఛాగల్లు గ్రామానికి చెందిన అన్నెపు కుమార్, చంద్రుతండాకు చెందిన అఖిలను డివిజన్ కేంద్రంలో షూటింగ్ బాల్ జిల్లా బాధ్యులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఇనుగాల యుగేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు, షూటింగ్ బాల్ జిల్లా ఉపాధ్యక్షుడు బొజ్జపల్లి సుభాష్ మాట్లాడారు. ఈనెల 5న నారాయణపేట జిల్లా మక్తల్‌లో జరిగిన షూటింగ్ బాల్ రాష్ట్రస్థాయి సీనియర్ పోటీల్లో పాల్గొన్న అన్నెపు కుమార్, అఖిల ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపిక కావడం సర్వత్రా అభినందనీయమన్నారు. ఈనెల 25 నుంచి 28వ తేదీవరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని, జాతీయస్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ చాటాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంద రమేష్, ఉపాధ్యక్షులు పురమాని రజాక్, భూక్య సుధాకర్, ప్రధాన కార్యదర్శి అన్నెపు కుమార్, పీఈటీలు సుధాకర్, చందర్, సఫర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



పాలకుర్తి టౌన్: వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ



తరిగొప్పుల: నంబర్ ప్లేట్ లేని వాహనాన్ని సీజ్ చేసిన ఎస్సై నరేష్

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని గుడివాడ చౌరస్తాలో సోమవారం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకుర్తి సీఐ డి.విశ్వేశ్వర్, ఎస్సై తాళ్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో సరైన పత్రాలు లేని వాహనాలకు ఫైన్ వేశారు. సీఐ మాట్లాడుతూ డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వాహనాలను సీజ్‌చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ విధిగా వాడాలన్నారు. ఎస్సై యాకుబ్‌హుస్సేన్, సిబ్బంది ఉన్నారు.

నంబర్ ప్లేట్ లేకపోతే కేసు

తరిగొప్పుల: వాహనాలకు నంబర్ ప్లేట్ లేకపోతే చీటింగ్ కేసు నమోదు చేస్తామని ఎస్సై దూదిమెట్ల నరేష్ హెచ్చరించారు. సీపీ రంగనాథ్ ఆదేశాల మేరకు సోమవారం మండలకేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మండలకేంద్రానికి చెందిన చింతల సన్నీ తన ద్విచక్ర వాహనానికి నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతూ పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేయడంతో పాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు. సిబ్బంది విఠల్, కనకరాజుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పాలకుర్తి టౌన్: మండలంలోని ముత్తారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987–88 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సుదర్శనం, దివాకర్, యుగందర్, అక్బర్, రామాచారి, సమ్మయ్య, ప్రభాకర్, హెచ్‌ఎం సంధ్యారాణిలను సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నిర్వాహకులు మంచోజు రాజేష్, రవి, యాదగిరి, ఉపాచారి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రఘునాథపల్లి: మండలంలోని రామరాయనిబంగ్లాలో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ బక్క యాదగిరి సోమవారం ప్రారంభించారు. సీడీఎఫ్ నిధులతో మంజూరైన రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులు చేపట్టారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో గ్రామస్తులందరూ కలిసి రావాలని కోరారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ యాదగిరి

దాతల సాయం మరువలేనిది

చిల్పూరు: గ్రామంలో బొడ్రాయి ఏర్పాటుకు దాతలు అందిస్తున్న సాయం మరువలేనిదని బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవ కమిటీ చైర్మన్ గంగుల సంపత్‌రెడ్డి అన్నారు. మండలంలోని లింగంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలకు దాత చిట్టిమల్ల రంగయ్య కుమారుడు వేదకుమార్ సోమవారం రూ.లక్ష విరాళాన్ని చైర్మన్ సంపత్‌రెడ్డి, సర్పంచ్ ఏదునూరి రవీందర్, ఎంపీటీసీ కంకటి రవి, ఉప సర్పంచ్ కంకటి రాజన్నలకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 7 నుంచి నిర్వహించే ఉత్సవాలకు ప్రజలు, దాతల సహాయ, సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. సత్తయ్య, కొంరయ్య, రచ్చ రవీందర్, గొడుగు రవి, యాదగిరి, కార్తీక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దాత వేదకుమార్

తృటిలో తప్పిన పెను ప్రమాదం

● క్లచ్‌ప్లేట్లు వేడెక్కి కాలిన మున్సిపల్ హైడ్రాలిక్ ఆటో

● ప్రమాదం నుంచి బయటపడిన కార్మికులు

జనగామ: అధికారుల నిర్లక్ష్యం మూలంగా మున్సిపల్ శానిటేషన్ హైడ్రాలిక్ ఆటోలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి దగ్ధమవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన జనగామ మండలం చంపక్‌హిల్స్‌లో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ మున్సిపల్‌కు చెందిన నంబర్‌లేని ఓ హైడ్రాలిక్ ఆటోలో ఇంటింటికి చెత్త సేకరణ చేసి చంపక్‌హిల్స్ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. కార్మికుడు పెద్దగల్ల సుధాకర్ డ్రైవింగ్ చేస్తుండగా, మరో కార్మికుడు సోమారపు రమేష్ పక్కనే కూర్చున్నాడు. చంపక్‌హిల్స్ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో క్లచ్ ప్లేట్ల నుంచి కాలిపోయి వాసన రావడంతో అప్రమత్తమైన సుధాకర్ బ్రేక్ వేసేందుకు ప్రయత్నించాడు. అవి ఫెయిల్ కావడంతో ఆటో ముందుకు వెళ్లిపోయింది. నిమిషం వ్యవధిలో ఆటోలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పక్కనే ఉన్న కార్మికుడు రమేష్ కిందకు దూకగా, డ్రైవింగ్ సీట్‌లో ఉన్న సుధాకర్ అందులోనే ఉండి పోయాడు. ఆటో చుట్టూ మంటలు ఎగిసి పడుతుండడంతో అటువైపు వెళ్లేందుకు ఎవరూ కూడా ముందుకురాలేదు. దీంతో రమేష్ సాహసం చేసి ఆటో ఎడమవైపు డోర్‌ను బలవంతంగా తీయడంతో సుధాకర్ స్వల్ప గాయాలతో తృటిలో ప్రాణాపాపం నుంచి తప్పించుకున్నాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు ఆటో ఎలా దగ్ధమైందనే విషయమై ఆరా తీశారు.



దగ్ధమవుతున్న హైడ్రాలిక్ ఆటో



ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న కార్మికుడు సుధాకర్